# చదువుకున్నవారి ప్రేమవేరు

వచ్చి రెండ్నెల్లయ్యింది. ఎంతో సరదాగా ఉంటారు. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు ఆమె వంక ఓరగా చూస్తూ "సీ యూ, బై" అంటూ ఎంతో సుతారంగా చెప్తాడతను. "ఈయనా వున్నారు! ఎందుకు?" వెంకాయ్ వెళ్ళొస్తానేవే అంటూ మోటుగా..." ప్రక్కవాటాలో అద్దెకున్న పడుచు జంట అన్యోన్యతను నెమరువేసుకుంటోంది వెంకాయమ్మ.

రాళ్ళలోంచి బియ్యం ఏరుతూ, మధ్య మధ్యలో కిలో మూడున్నర కిచ్చిన వాడిపై విరాకు పడుతూ...

"అయినా మా కాలంలో కాన్వెంటు చదువుల్లేవాయె?" ఏం చేస్తాం కర్మ, కర్మ..." అంటూ వంటింట్లోకి దూరింది వెంకాయమ్మ.

సాయంత్రం ఆరైంది. గుమ్మంలో నిలబడి ప్రక్కవాటావైపే చూస్తోంది వెంకాయమ్మ. అబ్బ! టంచన్‌గా ఆరింటికల్లా వస్తాడు, వచ్చీ రావడంతోనే "హాయ్! రాగిణీ హౌ ఆర్ యూ" అంటూ ప్రేమగా పలకరిస్తాడు మోహన్. రోజూ సరదాగా షికార్లకి, సినిమాలకి వెళ్తారు ఇద్దరూ. ఈయన మాత్రం ప్రతిరోజూ రాత్రి ఏడున్నర, ఎనిమిదింటికి గాని రారు. ఎప్పుడు చూసినా ఆఫీసు, పని అదే గొడవ. పెళ్ళయిన నాటి నుండీ ఇదే వరస.

అయినా "మోసే గాడిదపైనే మరింత బరువు పెడతారన్నట్టు" కొత్తగా చేరినవాళ్ళ పనిని కూడా ఈయన నెత్తినే రుద్దుతాడు ఆ మేనేజర్ రుద్రమూర్తి. ఏం చేస్తాం. "అంకితభావమున్న వారికి అక్షింతలు తప్పుతాయా" అనుకుని నిట్టూర్చింది వెంకాయమ్మ.

ఆరాటం ఆపుకోలేక, ఆరాలు తీయాలని అప్పుడప్పుడు రాగిణితో పిచ్చాపాటి వేయడం, ఆపై ఆవగింజంత కూడా దాచకుండా మేడపైని రాజేశ్వరికి, ఎదురింటి పుల్లమ్మకు, ప్రక్కవీధి కామాక్షికి ఇలా... చేరవేయడం పరిపాటైంది వెంకాయమ్మకు.

ఇంటికి ఆలస్యంగా రావడం అలవాటైన పరిశ్రమరావు అడుగు పెడ్తూనే "వ సేవ్, ఏమేవ్... అలసిపోయాను... అరగ్లాసు కాఫీ తగలేయి".

"ఆ వచ్చే వచ్చే... పొయ్యి మీద నీళ్ళు మరుగుతున్నాయి. ఏం సంసారమో ఏమో నెల మధ్యలోనే పంచదార అయిపోయింది." సణుగుతూ సగం కప్పు పంచదారా బదులు కెళ్లింది. కిలకిల నవ్వులు వినబడి క్షణం సేపు కిటికీ లోంచి తొంగి చూసింది.

"కొంచెం తాగు ప్లీజ్, అబ్బ నాకొద్దండి", "నా గురించి ప్లీజ్", "కొత్తగా అలవాటు చేసుకోవాలంటే కష్టంగా వుందండి", "ఈ ఒక్కసారికి తాగు."

"సరేనండి మీ కోసం తాగుతాను" లేత గులాబీ పెదవులను మోహన్ చేతిలోకి కాఫీ కప్పు అందించింది రాగిణి.

ఆ కదలికలో రాగిణి కట్టుకున్న కొత్తకోట జరీ అంచుపై కాఫీ కొంచెం ఒలికింది. కంగారుగా 'ఐయామ్ సారీ' అని, కర్చీఫ్‌తో సుతారంగా తుడిచాడు. ఆ చర్యలలోని అనురాగానికి ఆమె ఆనందంగా 'థ్యాంక్యూ' అంటూ కిటికీ వైపు చూసి "అయ్యో! పిన్నిగారూ మీరా? ఎంతసేపయ్యింది వచ్చి?" అడిగేసరికి—

భుజాలు తడుముకుంటూ "ఇప్పుడేనమ్మా ఓ అరకప్పు పంచదార కోసం వచ్చా"నంటూ లోపలికడుగు పెట్టిన వెంకాయమ్మను చూసి కంగారుగా అక్కడి నుండి కదిలాడు మోహన్.

★★★★★

"వాళ్ళది ప్రేమ—పెళ్ళి వదినా! ఒకే ఆఫీసులో పనిచేసేవారట! పెళ్ళికి ముందే మోహన్ కోరిక మేరకు"...

"ఆ! కోరిక మేరకు..." ఆశ్చర్యంగా అడ్డుపడింది పుల్లమ్మ "ఛ! ఊరుకోవదినా, నువ్వనుకున్నట్టు అదికాదు."

"మరేది...?"

"ఉద్యోగానికి రాజీనామా చేసిందట!"

"కరువు కాలంలో ఎంత సాహసానికి ఒడిగట్టారు.

భార్య అంటే ఎంత ప్రేమో!"

"ఉద్యోగాలు చేద్దామంటే మనకు చదువుల్లేవాయె... అయినా వదినా! నాకు తెలియకుడుగుతాను. చదువుకున్నోళ్ళ ప్రేమలే వేరా ఏం?... నిన్నేం జరిగిందనుకున్నావు వదినా" అంటూ తను కిటికీలోంచి చూసిందంతా దూరదర్శన్‌లా కళ్ళకు కట్టేనట్లు వినిపించింది వెంకాయమ్మ. ఆ నాటి మధ్యాహ్న ప్రసారాలు అంతటితో ముగిసాయి.

నలుగురు కుర్రాళ్ళు ఆమె వంకే చూస్తుండడంతో కనుబొమ్మలు చిట్లేస్తూ, ఏమిటన్నట్టు వాళ్ళకేసి చూసింది. అప్పుడే మేడపై నుంచి క్రిందకు దిగుతున్న వెంకాయమ్మ ఆ చూపుకి కుర్రాళ్ళు దడుసుకొని "అబ్బే ఏం లేదండి, మేడపైని పోర్షన్ అద్దెకిస్తారేమోనని..."

"బ్యాచిలర్సా లేక పెళ్ళీగట్రా..." అంటున్న వెంకాయమ్మకేసి వినయంగా చూస్తూ "నలుగురము శ్రీమాన్ బ్రహ్మచారులమండి" అన్నారు.

నిట్టూరుస్తూ... "పెళ్ళయినవారికే ఇవ్వబడును. మీరు ప్రక్కవీధికెళ్ళండి" అంది వెంకాయమ్మ.

అప్పటికే చెప్పులరిగేటట్టు తిరిగి బ్రహ్మచారులు "బహుశా ఆడాళ్ళ మధ్యాహ్నం మీటింగులకి శ్రోతల సంఖ్య తగ్గుతుందని భయం కాబోలు. బ్రహ్మచారుల మనగానే చిన్నచూపు చూస్తారు" గొణుగుతున్న వాళ్ళవంక కోపంగా చూసింది వెంకాయమ్మ.

తీక్షణమైన ఆ చూపుకి తోక ముడిచారు వాళ్ళు. అప్పుడే వస్తున్న భర్తను చూసి రుసరుసలాడుతూ లోనికెళ్ళింది.

'ఈ రోజు వీధిలో పెట్టావేంటే మీటింగు' కేకలేశాడు పరిశ్రమరావు.

"ఆ! మాకంత అదృష్టం కూడానా!... మోహన్ స్నేహితులొస్తే ఎంతో కలగలపుగా మాట్లాడుతుంది రాగిణి" పది మందితో మాట్లాడితే పరాకు చెందుతారీయన. అయినా చదువుకున్నోళ్ళ తీరేవేరు" వంటింట్లో గొణుక్కుం

టుంది వెంకాయమ్మ.

★★★★★

రెండ్నెల్ల క్రింద తమ్ముడి పెళ్ళికని వెళ్లి క్రిందటి వారమే వచ్చింది వెంకాయమ్మ. ఆ రోజు ఎంతో హుషారుగా వుంది. క్రితంరోజు రాత్రి తనకు తెలిసిన విషయం అందరికి వెంటనే చెప్పాలి. తహతహలాడుతూ మీటింగు టైం ఎప్పుడవుతుందా అని ఆదుర్దాగా ఎదురు చూస్తోంది.

ఉదయాన్నే, ఆడాళ్ళందరు ఒకరిని చూసి ఒకరు పమిటలు సర్దుకున్నారు. అది వాళ్ళ కోడ్ భాష. ఆ సైగకర్థం మధ్యాహ్నం అత్యవసర సమావేశమని, అందరు పగలు మీటింగుకు టంచన్‌గా రావాలని.

ఆ రోజు అయిదు నిమిషాలు ముందుగానే చేరారందరు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. వెంకాయమ్మ రావడంతోనే ''రాగిణి, మోహన్ విడాకులిచ్చుకున్నారు'' బాంబు పేల్చింది. ఆమె మోములో ఎవ్వరికీ అర్థంకాని ఆనందగర్వం తొణికిసలాడింది.

అందరిలో కల్లోలం బయలుదేరింది.

ఎంత అన్యోన్యమైన జంట!

ఎలా జరిగింది?

రాగిణి మోహన్‌ని వదిలేసిందా?... లేక మోహన్....?

ఎవరికి తోచింది వాళ్ళంటూ వెంకాయమ్మ వైపు మరింత ఆతృతగా చూస్తున్నారు.

సర్దుకుని కూర్చొని ఇక మొదలెట్టింది వెంకాయమ్మ. చాలా రోజులుగా ఇల్లు తాళం వేసుంది. ఈ మధ్య వాళ్ళ విషయాలేమీ తెలియడంలేదు. నిన్న సాయంకాలం మోహన్ మరో అమ్మాయితో రావడం చూసి ఆశ్చర్యపోయాను. కాసేపటికి వరండాలోకి వచ్చాడతను.

''ఏం బాబు రాగిణి పుట్టింటికెళ్ళిందా?' అంటూ మొదలు పెట్టాను.

''లేదండి డైవర్స్ తీసుకున్నాం'' అన్నాడు.

సరిగ్గా అర్థంకాక ''ఎప్పుడొస్తుంది బాబు'' మళ్ళీ అడిగాను.

''ఇక రాదండి. రాగిణి, నేను విడాకులు తీసుకున్నాం.''

గుండెలో రాయి పడ్డట్టయింది. అయినా ధైర్యం చేసి ఎందుకనడిగాను.

''మీరే చెప్పండాంటి. తను కష్టపడడం ఇష్టం లేక ఉద్యోగం మాన్పించాను. అప్పట్లో సరేనన్న



రాగిణి ఏడాదవ్వగానే ఆఫీసులో, నే మిగతా ఆడవాళ్ళతో చనువుగా వుంటున్నానని ఆమెలో అనుమానం బయలుదేరింది. గోరంతలు కొండంతలు చెయ్యొద్దని చాలా నచ్చజెప్పాను. అయితే "నాకు ఇంటిపని బోర్ కొడ్తుంది మోహన్, ఐ విల్ గో ఫర్ జాబ్, యు లుక్ ఆఫ్టర్ ది హౌజ్" అంటూ సింపుల్‌గా చెప్పిందండి.

ముక్కుమీద వేలేసుకున్నారందరు.

మోహన్ చెప్పుకుంటూ పోతున్నాడొదిన "న్యాయం చెప్పండొంటీ?" ఆనాడు అడగ్గానే ఒప్పుకున్నందుకు థ్యాంక్స్ చెప్పాను. ఇప్పుడు నే జాబ్ వేస్తాను ప్లీజ్ అంది. నో, సారీ అన్నాను. అంతే కలిసి వుండలేమనుకున్నాం. లెట్ అజ్ టేక్ డైవర్స్" అంటూ విడిపోయాం.

మళ్ళీ ఇలాగే జరుగుతుందేమోనని రోసిని 'కాంట్రాక్ట్ మ్యారేజ్" వేసుకున్నానండి' అని. "కమ్ హియర్ మోహన్" అన్న రోసి పిలుపుకి అతను లోనికి వెళ్ళిపోయాడొదినా..." అంటూ దీర్ఘం తీసింది వెంకాయమ్మ.

నేనప్పట్లో ఈ ప్లీజ్, సారీ, థాంక్యూ వెనక ఇంత కథ వుంటుందనుకోలేదమ్మ అంటున్న వెంకాయమ్మకు 'హాసేవ్ ఏమేవ్ ఎక్కడున్నావే' అంటున్న భర్త పరిశ్రమరావు కేకలు వినిపించి పమిట సర్దుకుంటూ పరుగుతీసింది.

"ఆ! చదువుకున్నోళ్ళ ప్రేమలేవేరు" వ్యంగ్యంగా ఒకావిడ నిట్టూర్పు. "నీ మాటగాని వదిన చదువు కున్నోళ్ళందరు ఇలాగే వుంటారంటావా?"

"నువ్వెన్నయినా చెప్పు వదిన నాకు మాత్రం ఏమేవ్, హాసేవ్ అనడమే నయమనిపిస్తుంది."

"వాదస్తంగాని, ఆడాళ్ళు చదువుకొని ఉద్యోగాలు చెయ్యకూడదా ఏం?..."

"నాకు తెలియకడుగుతానొదిన థ్యాంక్యూ, ప్లీజ్, సారీ అనుకుంటూనే విడాకులా?"

"అదే వదినా నాకు అర్థంకాలేదు!"

"ఏమోనమ్మా. రేపు వెంకాయమ్మ వదిన వస్తేగాని తేలదు అనుకుంటూ..." తమ తమ ఇంటిదారి పట్టారు.

■ ■ ■

# కాలేజీ తమాషాలు

నిర్వహణ: యన్.రాంచందర్‌రావు


నేను డి.సి.ఇ. (డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్) సెకండ్ ఇయర్‌లో ఉన్నప్పుడు మా కాలేజ్‌డే సెలబ్రేషన్ సందర్భంగా ముఖ్య



అతిథిగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి గారు వస్తున్నారంటూ స్కౌట్స్, గైడ్స్ నందర్ని సమావేశపర్చి అన్ని ఏర్పాట్లు సజావుగా జరిగేందుకు మా హెడ్‌మాస్టరు గారు ఓ రోజు క్లాస్ తీసుకున్నారు వీరికి మధ్యలో సడన్‌గా ప్రశ్నలడిగి, జవాబు చెప్పకపోతే అందరిముందు తనదైన బాణీలో దెప్పిపొడవటం అలవాటు. అలాగే ఆ రోజు మధు అనే విద్యార్థి నుద్దేశించి మన సి.ఎం. గారు ఎక్కడ చదువుకున్నారో తెలుసా అనడిగారు. దానికతను తెలీద్సార్, వచ్చాక అడుగుతాను అని చెప్పాడు. ఇక నవ్వకుండ ఎలా ఉంటాం. అందుకు మా మాస్టర్ గార్కి కోపమొచ్చి సంవత్సరానికి ఎన్ని నెలలో, ప్రస్తుతం ఈ నెలేంటోనైనా చెబుతావా కనీసం! అన్నారు. అతను వెంటనే ప్రస్తుతం జన్, సంవత్సరానికి ట్వెల్. అవి జాన్ ఫబ్, మార్, ఎఫ్, మే, జన్, జల్, ఆగ్, సెప్, అక్, నవ్, డిస్ అని వెనక్కి తిరిగాడు. కోపంలో ఉన్న సార్‌తో పాటు అందరం హాయిగా నవ్వేశాం. అప్పట్నుంచతని పేరు మథ్ అని పిల్చేవారు సార్‌గారు. సరదాకి మారుపేరైన మథ్‌కి క్షమాపణలతో.

ఎం. త్రివేణి, పెద్దపల్లి.

అవి మేము ఎస్.కె. యూనివర్శిటిలో చదివే రోజులు. 1990వ సంవత్సరంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "బడ్జెట్"పై యూనివర్శిటీలో ఒక సెమినార్ పెట్టారు. చాలామంది అబ్బాయిలు, అమ్మాయిలు బడ్జెట్‌ను ప్రశంశిస్తూ విమర్శిస్తూ ఉపన్యాసాలు ఇచ్చారు. చివరికి మా రూమ్‌మేట్ ప్రకాష్ 'బడ్జెట్'ను విమర్శిస్తూ ఆవేశపరుడై ఇలాంటి బడ్జెట్ వలన జన సామాన్యులు, ఏదో ఒక రీతిలో ప్రతిరోజు ప్రభుత్వానికి పరోక్షంగా పన్నులు కట్టవలసి ఉంటుంది. అయితే పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు మాత్రం ప్రభుత్వానికి పన్నులు కట్టకుండా "ఎగ••••తుంటారు" అని అనగానే సెమినార్ హాలంతా నవ్వులతో నిండిపోయింది. ఈ పొరపాటు వెంటనే గ్రహించిన అతను "సారి" అని మళ్ళీ తన ఉపన్యాసం కొనసాగించాడు.



బి. చంద్రశేఖర్ రెడ్డి,
లైబ్రేరియన్,
శ్రీ సిద్ధార్థ మెడికల్ కాలేజీ,
తుమ్‌కూర్.

మీ కాలేజీ రోజుల తమాషా సంఘటనలు రాసి ఫోటోతో సహా పంపండి! ప్రచురిస్తాం.